సాక్షి వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 19 । డిసెంబర్ । 2024



ప్రజల నెత్తిన రూ.6వేల కోట్ల గుదిబండ

సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని విస్మరించి ప్రజల నెత్తిన రూ.6వేల కోట్ల గుదిబండ మోపారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. -8లో



రైతులతో చర్చించి ధర నిర్ణయిస్తాం

రైతులతో చర్చించిన తర్వాతే అవార్డు ప్రకటించి భూముల ధర నిర్ణయిస్తామని వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 26.5/20.2

జిల్లాలో బుధవారం 20.2 - 26.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.92 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు డయల్ యువర్ ఆర్ఎం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీలోని సమస్యలు, సలహాల కోసం శుక్రవారం సాయంత్రం 4-5 గంటల మధ్య డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలతో పాటు, సూచనలు, సలహాలను 99592 25848 నెంబరుకు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చని వివరించారు.

ప్రీమియం చెల్లింపు గడువు పొడిగింపు

కడప అగ్రికల్చర్: మామిడి పంటకు వాతావరణ ఆధారిత బీమా పథకంలో ప్రీమియం చెల్లింపునకు ప్రభుత్వం ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి తెలిపారు. ఈ నెల 15వ తేదీతో ముగిసిన గడువును ఈ నెల 31వ తేదీ వరకు పెంచారని ఆమె తెలిపారు. ప్రీమియం చెల్లించని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కడప సెవెన్‌రోడ్స్: భూ సమస్యల పరిష్కారానికి గురువారం 36 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్‌లో మాదాపూర్, మరతిపల్లి, డి. అగ్రహారం, చింతలచెరువు, పుల్లారెడ్డిపల్లి, మిట్టమానిపల్లి, అక్కలరెడ్డిపల్లె, కత్తెరగండ్ల (కొడిగుడ్లపాడు), పులివెందుల రెవిన్యూ డివిజన్‌లో చిలెకంపల్లి, మురారిచింతల, బ్రాహ్మణపల్లె, నంద్యాలంపల్లి, గోటూరు, వేంపల్లె-1, వి.కొత్తపల్లి, పిల్లివారిపల్లిలో సదస్సులు ఉంటాయన్నారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లోని పిచపాడు, దువ్వూరు, పి.బొమ్మేపల్లి, ఓబన్నపేట, గండ్లూరు, నల్లబల్లి, రామచంద్రాయపల్లి, పెద్దపసుపుల, సరివ్వరెడ్డిపల్లె, అయ్యవారిపల్లె (హాబిటేషన్), కలమల్లలో.. కడప రెవెన్యూ డివిజన్‌లోని చిన్నమాచుపల్లి , ఇప్పపెంట, గొల్లపల్లి, నాగసానిపల్లి, నందిమండలం, ఏవీ కాలువ, పెద్దపల్లి, జంగమపల్లి, పెన్నపేరూరు గ్రామాల్లో సదస్సులు జరుగనున్నాయని వివరించారు.

22న 'సన్నపురెడ్డి'కి 'కేతు' పురస్కారం

కడప కల్చరల్: ప్రముఖ కథా రచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి పేరిట స్మారక జీవన సాఫల్య పురస్కారాన్ని జిల్లాకు చెందిన కవి, 'కొండపొలం' నవలా రచయిత సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డికి అందజేయనున్నారు. ఈనెల 22న స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో కవిత విద్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు అలపర్తి పిచ్చయ్యచౌదరి, కోశాధికారి బోయపాటి దుర్గాకుమారి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు ఈ పురస్కారాన్ని సన్నపురెడ్డికి అందజేస్తారు. సభకు సీనియర్ కథా రచయిత దాదా హయాత్ అధ్యక్షత వహిస్తుండగా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వనాయుడు , అడిషనల్ ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు అతిథులుగా రానున్నారు. ప్రముఖ సాహితీ విమర్శకులు ఆచార్య మేడిపల్లి రవికుమార్ సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి సాహిత్యంపై, ప్రముఖ రచయిత్రి ఆర్.శశికళ కేతు విశ్వనాథరెడ్డి సాహిత్యంపై ప్రసంగించనున్నారు.

సీఐ రవిశంకర్‌రెడ్డికి అవార్డు

రాయచోటి: ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ రాష్ట్ర ఉత్తమ నేర పరిశోధన కేసులకు గాను ఇచ్చే ప్రతిష్టాత్మక ఏబీసీడీ అవార్డు అన్నమయ్య జిల్లా దిశ పోలీసు స్టేషన్ సీఐ రవిశంకర్‌రెడ్డికి దక్కింది. బుధవారం విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో చిత్తూరు జిల్లా ఎస్పీ వీన్ మణికంఠ చందోలుతో కలిసి డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ ఏడాది జులై 7వ తేదీన చిత్తూరు జిల్లా గుడిపాల మండలంలో జరిగిన ఏటీఎం దొంగతనం కేసులో కరడుగట్టిన అంతర్‌రాష్ట్ర నేరస్తుడిని అరెస్టు చేసినందుకు ప్రతిష్టాత్మక ఏబీసీడీ అవార్డులో మొదటి స్థానంలో ఎంపికయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట టౌన్: ఈనెల 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గూగుల్ షీట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఈనెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా క్రీడాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు కోసం రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సాయంత్రం 4 గంటల నుంచి సాంకేతిక సహాయం కోసం టెక్నికల్ అఫిషియల్ ఏ.రామాంజనేయులును సంప్రదించవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునేవారు 18 సంవత్సరాలలోపు వారు అయితే ఎఫ్ఏఐ గుర్తింపు కార్డు, 18 సంవత్సరాలు పైబడిన వారైతే ఎఫ్ఏఐ గుర్తింపు కార్డుతో పాటు గతంలో పాల్గొన్న ఫెన్సింగ్ క్రీడ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. వివరాలకు 6301979079 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తుఫాను టెన్షన్!

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అన్నదాతలు సహా పలు వర్గాల్లో ఆందోళన మొదలైంది. చేతికందివచ్చిన పంట వర్షార్పణం అవుతుందనే బెంగ ఓ వైపు.. సాగులో ఉన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందనే గుబులు మరో వైపు రైతన్నలను వెంటాడుతోంది. దీనికి తోడు తుఫాను ఎఫెక్ట్‌తో వ్యాధులు విజృంభిస్తున్నాయి.

- వరుస తుఫానులతో బెంబేలెత్తుతున్న జనం
- ఇటీవలి వర్షాలకు వరి పంటపై తీవ్ర ప్రభావం
- చిరు వ్యాపారుల జీవనానికి దెబ్బ
- మరోవైపు ముసురుకుంటున్న వ్యాధులు



వైఎస్ఆర్ జిల్లా చెన్నూరు మండలంలో ఇటీవల వర్షాలకు నేలకొరిగిన వరి పంట

సాక్షి కడప/సాక్షి రాయచోటి: తుఫానులు భయపెడుతున్నాయి. ఇదేంటి తుంపర వర్షమే కదా అనుకుంటున్నారా... నిజమే వరుణ దేవుడు కురిపించే తుంపరే టెన్షన్ పెడుతోంది. అందుకు కారణాలు లేకపోలేదు. ఒకటి కాదు, రెండు కాదు.. రెండు, మూడు నెలల వ్యవధిలోనే నాలుగైదు తుఫాన్లు రావడంతో పంటలు వేసిన రైతులతోపాటు వ్యాపారులు కూడా అమ్మో తుఫాను అంటూ హడలిపోతున్నారు. అందులోనూ శీతాకాలం సీజన్ కావడంతో తుఫాను ధాటికి చలి విపరీతంగా పెరిగి రాత్రి, తెల్లవారుజాము సమయాల్లో వాతావరణం మంచు దుప్పటిలా కప్పుకుంటోంది. చలి పెరగడం...వ్యాధులు పంజా విసురుతుండడం...పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో జన జీవనం కూడా స్తంభించిపోతోంది.

చిరు వ్యాపారుల్లో అలజడి

ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో తుఫాను ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయగానే చిరు వ్యాపారుల గుండెల్లో అలజడి మొదలైంది. సాధారణ వర్షమైతే అప్పటికప్పుడు లేదా ఒకరోజుతో తెరిపి లభిస్తుంది. కానీ, తుఫాను అయితే మూడు, నాలుగు రోజులపాటు తీవ్రత ఉండడంతో వ్యాపారాలు కూడా పూర్తి స్థాయిలో పడిపోతున్నాయి. అసలు చిన్నచిన్న షాపులకు వ్యాపారాలు లేక లబోదిబోమంటున్నారు. రోడ్డు వారగా విక్రయించే పండ్ల వ్యాపారులు, డ్రై ఫ్రూట్స్, దోసెలు, బజ్జీలు, టీకొట్లు, చిరుతిండ్ల బండ్లు ఇంటికే పరిమితం అవుతున్నాయి. అందుకే తుఫాను అనగానే ముందుగా వారి గుండెల్లోనే రైళ్లు పరిగెడుతున్నాయి.

జనజీవనం అస్తవ్యస్తం

ఇటీవల కురిసిన వర్షాలకు రైల్వేకోడూరు నియోజకవర్గంలో వాగులు, వంకలు పోటెత్తాయి. రిజర్వాయర్లకు కూడా నీటి ప్రవాహం పెరగడంతో దిగువకు వదిలారు. ప్రధానంగా రోడ్లు కొట్టుకుపోవడం , వాగులు, వంకల్లో నీటి ప్రవాహం పెరగడంతో పల్లెల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షం కారణంగా ప్రధాన రహదారులపై జనాలు కనిపించడం లేదు. చాలా వరకు ప్రయాణాలు సైతం వాయిదా వేసుకుని ఇళ్లకే పరిమితం అవుతున్నాయి. ద్విచక్ర వాహనదారులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. ఏది ఏమైనా ఇలా అనేక వర్గాలను తుఫాను టెన్షన్ వెంటాడుతోంది.

ఐదు నెలల్లో వచ్చిన తుఫాన్లు:	06
వైఎస్సార్‌జిల్లా వ్యాప్తంగా సాగైన మినుము:	12,540 హెక్టార్లు
బుడ్డశనగ:	72,776 హెక్టార్లు
అన్నమయ్య జిల్లా...	
కోత దశలో ఉన్న వరి:	1300 ఎకరాలు
సాగైన మినుము:	9253 హెక్టార్లు

అన్నదాతల్లోనూ ఆందోళన



తుఫాను వచ్చిందంటే ప్రధానంగా అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. సాగులో ఉన్న పంటలకు ప్రయోజనం కంటే నష్టాలే ఎక్కువగా మిగుల్చుతున్నాయి. ఇటీవలి తుఫానులో కురిసిన వర్షాలతో అటు వైఎస్సార్, ఇటు అన్నమయ్య జిల్లాల్లోని రైల్వేకోడూరు, రాజంపేట, తంబళ్లపల్లె, మదనపల్లె, మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, చెన్నూరు ఇలా అనేక ప్రాంతాల్లో పండ్ల తోటలతోపాటు వరికి దెబ్బతగిలింది. నోటికాడికి వచ్చిన వరి పంట పొలాల్లోనే నేల వాలిన పరిస్థితి. ఇప్పుడు కూడా వరి పంట కోత దశలో ఉంది. కానీ తుఫాను అనగానే ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుందోనన్న ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది.

పడకేస్తున్న పారిశుద్ధ్యం

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వర్షంతోపాటు తుఫాను ప్రభావంతో పారిశుద్ధ్యం పడకేస్తోంది. తుఫాను ప్రభావం నెలకొన్న ప్రతిసారి రెండు, మూడు రోజులపాటు ఏకధాటి వర్షాలు కురుస్తుండడంతో గ్రామాలతోపాటు పట్టణాల్లోనూ పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. వీఐపీల పర్యటన సమయంలోనే బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు తప్ప మిగతా సమయాల్లో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం గురించి పట్టించుకోవడం లేదు.

ముసురుతున్న వ్యాధులు

ప్రతిసారి తుఫాన్లు వచ్చినప్పటి నుంచి చలి విపరీతంగా పెరగడం.. శీతాకాల సీజన్ కావడంతో సమస్య మరింత జటిలమవుతోంది. జలుబు, జ్వరాలు, దగ్గు, శ్వాసకోశ వ్యాధులతో వృద్ధులతోపాటు చిన్నారులు వణికిపోతున్నారు. అంతేకాకుండా ఇతర వ్యాధులు కూడా విస్తరిస్తున్నాయి. తుఫాను ప్రభావం నేపథ్యంలో వ్యాధులతో ఆస్పత్రుల వైపు జనాలు పరుగులు తీస్తున్నారు. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలోని రిమ్స్‌తో పాటు రాయచోటిలోని పెద్దాస్పత్రి, మదనపల్లె, ప్రొద్దుటూరులలోని జిల్లా ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. రెండు జిల్లాల్లోని మైదుకూరు, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు, రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు, పీలేరులోని ప్రైవేటు ఆస్పత్రులు కూడా రోగులతో నిత్యం రద్దీగా మారుతున్నాయి. ప్రధానంగా చలికి తోడు తుఫాను ప్రభావంతో వాతావరణంలో మార్పు ఫలితంగా చిన్నారులు, వృద్ధుల్లో దగ్గు, ఆయాసం ఒక్క ఉదుటున తగ్గకపోవడంతో ఎక్కువ ఆందోళన చెందుతున్నారు.

రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రతిరోజు వచ్చే రోగుల సంఖ్య: 1200

మదనపల్లె, ప్రొద్దుటూరులలో జిల్లా ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య: 1800-2000

రెండు జిల్లాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు రోజువారీగా వచ్చే రోగుల సంఖ్య: 12 వేలకు పైగానే

రిమ్స్ అభివృద్ధి అందరి బాధ్యత

- రిమ్స్‌లో హెచ్‌ఓడీల సమావేశంలో కలెక్టర్ శ్రీధర్



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పలు విభాగాల్లో తనిఖీ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో వైద్యులు

కడప అర్బన్: జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న జిల్లా సర్వజన ఆసుపత్రి (రిమ్స్)ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వైద్య విభాగాధిపతులకు సూచించారు. బుధవారం రిమ్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అక్కడి సెమినార్ హాల్‌లో వైద్య విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సువిశాలమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో వేలాది మంది ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఈ ఆసుపత్రిని, మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే చాలా అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయనీ, అందులో భాగంగానే అధునాతన సదుపాయాలతో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, కేన్సర్ రీసెర్చ్ ఆసుపత్రి, మానసిక వైద్యశాలలు ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. మరో 5-6 నెలల్లో అత్యాధునిక వైద్య సేవలు అందించే మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుదామని పేర్కొన్నారు. అత్యంత విలువైన, అధునాతన వైద్యపరికరాలను వైద్య విభాగాధిపతులు కేవలం వైద్యం వరకే పరిమితం కాకుండా ఆయా విభాగాల్లో పరికరాల నిర్వహణ, యాజమాన్యంపై కూడా దృష్టి సారించాలని సూచించారు. వైద్యం కోసం వచ్చే ప్రతి పేషెంట్ 100శాతం సంతృప్తికరంగా ఇంటికి వెళ్లేలా వైద్య సేవలు అందించాలన్నారు. సమావేశానికి ముందుగా జీజీహెచ్‌లోని అన్ని విభాగాల్లో అవసరమైన వసతులు, సదుపాయాలు, వైద్య పరికరాలు, వైద్య సిబ్బంది తదితర అన్ని వివరాలను ఆయా వైద్య విభాగాధిపతులను అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల సరైన వసతులు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, ఏపీవీవీపీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ హిమదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, అడిషనల్ డీఎంఈ, ప్రిన్సిపాల్ ఏ. సురేఖ, ఆర్ఎంఓ శ్రీనివాసులు, డిప్యూటీ ఆర్ఎంఓలు రాజేశ్వరి, సునీత, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ బాలాంజనేయులు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కిక్కే.. కిక్కు!



- జిల్లాలో మరో రెండు బార్లు, ఒక ప్రీమియం స్టోర్‌కు నోటిఫికేషన్
- ఇప్పటికే వ్యాపారాలు లేక తలలు పట్టుకుంటున్న వైన్‌షాప్, బార్ యజమానులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: మద్యం విక్రయాల ద్వారా వచ్చే సొమ్మే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా మారింది. వీలైనంత ఎక్కువ ఆదాయం పొందేందుకు ప్రభుత్వం మరిన్ని బార్లు, లిక్కరు షాపుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. తాజాగా జిల్లాలో రెండు బార్లు, ఒక ప్రీమియం లిక్కర్ స్టోర్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చింది. కాగా లిక్కర్‌పై కమిషన్ సరిపోక తలలు పట్టుకుంటుంటే.. ఖజానా నింపుకోవడానికి ప్రభుత్వం మరిన్ని బార్లు ఏర్పాటు చేసి తమను బలి చేస్తోందని వైన్‌షాప్, బార్ల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

బార్.. బేజార్..

జిల్లాలో ప్రస్తుతం 28 బార్లు ఉన్నాయి. గతంలో ప్రభుత్వమే లిక్కర్ షాపులను నిర్వహించింది. అప్పట్లో రాత్రి 8 గంటలకు మద్యం దుకాణాలు మూసి వేయడంతో ఆ తరువాత బార్లకు మంచి వ్యాపారం జరిగేది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గతంలో కంటే ఎక్కువగా ప్రైవేట్ మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించింది. వీటి ద్వారా రాత్రి 10 గంటల వరకు విక్రయాల అనుమతులు ఇచ్చారు. దీంతో బార్ల వ్యాపారం దెబ్బతింది. ఫలితంగా చాలా మంది బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు వ్యాపారాన్ని లీజుకు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఆదాయం పొందడమే లక్ష్యంగా ప్రభుత్వం తాజాగా మరో రెండు బార్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై బార్ల నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగా ప్రీమియం లిక్కర్ స్టోర్....

జిల్లాలో కొత్తగా ఒక ప్రీమియర్ లిక్కర్ స్టోర్ల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రీమియం స్టోర్ దరఖాస్తుదారుడు నాన్ రిఫండబుల్‌గా రూ. 15 లక్షలు డీడీ ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే స్టోర్ దక్కించుకున్న వారు లైసెన్స్ కింద రూ. కోటి చెల్లించాలి. లైసెన్స్ వచ్చిన తరువాత 4 వేల చదరపు అడుగుల్లో స్టోర్ రూమ్ ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఇందులో రూ.1200లకు పైగా లిక్కర్ , రూ.400 పైగా ఉన్న బీర్లను మాత్రమే విక్రయించాల్సి ఉంటుంది. మద్యం ఏరులా పారుతున్న ప్రస్తుత పరిస్థితులో ప్రీమియం లిక్కర్ సేల్స్ కష్టమన్న భావన వ్యాపార వర్గాల్లో నెలకొంది. కాగా జిల్లా కేంద్రమైన కడపలో ప్రీమియం లిక్కర్ స్టోర్‌తో పాటు ఒక బార్‌ను, ఎర్రగుంట్లలో మరో బార్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు.

రహదారుల అభివృద్ధికి వినతి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి వినతిపత్రం అందజేసి సమస్యలను వివరిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

- భాకరాపేట నుంచి బెస్తవారిపేట రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలి
- కడప-ముద్దనూరు మధ్య నాలుగు లేన్ల రహదారి నిర్మించాలి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి వినతి పత్రమిచ్చిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని రహదారులను అభివృద్ధి చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరికి వినతిపత్రమిచ్చారు. జాతీయ రహదారి 716పైన ఉన్న భాకరాపేట నుంచి బద్వేలు (ఎన్‌హెచ్ 67), పోరుమామిళ్ల (ఎన్‌హెచ్ 167)మీదుగా ప్రకాశం జిల్లాలోని బెస్తవారిపేట (ఎన్‌హెచ్ 544డి) వరకు ఉన్న రహదారిని జాతీయ రహదారిగా ఉన్నతీకరించాలని కోరారు. రేణిగుంట నుంచి ముద్దనూరు వరకు గల ఎన్‌హెచ్ 716 ఎంతో కీలకమైందని తెలిపారు. కోడూరు, రాజంపేట, కడప, కమలాపురం, ఎర్రగుంట్ల, చిలంకూరు ద్వారా ముద్దనూరుకు వెళుతుందన్నారు. ఈ రహదారి వెంట అనేక శ్లాబ్ ఇండస్ట్రీస్ తో పాటు భారతి, జువారి, ఐసీఎల్ వంటి సిమెంటు కర్మాగారాలు, ఆర్టీపీపీ ఉన్నాయని వివరించారు. ఈ రహదారిపై ట్రాఫిక్ అధికంగా ఉంటుందన్నారు. వాణిజ్య సరుకులను రవాణా చేసే వాహనాలు నిరంతరం తిరుగుతుంటాయని తెలిపారు. దీంతో ఈ రహదారిపై తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. అందువల్ల కడప నుంచి ముద్దనూరు వరకు ఉన్న రహదారిని ఫోర్‌లేన్ రోడ్డుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కడప నుంచి రేణిగుంట వరకు 130 కిలోమీటర్ల మేర ఉన్న రహదారిని ఫోర్‌లేన్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఇప్పటికే మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఇక మిగిలి ఉన్న ముద్దనూరు-కడప (ఎన్‌హెచ్ 716)ను ఫోర్‌లేన్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ రహదారులను అభివృద్ధి చేస్తే నెలకు రూ. 3 కోట్లు టోల్ రూపంలో వస్తుందని తెలిపారు.

వనిపెంట మీదుగా హైవే విస్తరణ పనులు చేపట్టాలి

ఎన్‌హెచ్ 167 మైదుకూరు నుంచి పోరుమామిళ్ల వెళుతోందన్నారు. గతేడాది సర్వే కూడా నిర్వహించారని పేర్కొన్నారు. మైదుకూరు నుంచి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో వనిపెంట గ్రామం ఉంటుందన్నారు. ఈ జాతీయ రహదారి వనిపెంట గ్రామం మధ్య నుంచి వెళుతోందన్నారు. ఫలితంగా పలు కుటుంబాలు చిన్నచిన్న షాపులు, దుకాణాలు రహదారికి ఇరువైపులా పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్నఫలంగా ఈ జాతీయ రహదారిని వనిపెంట గ్రామంలో నుంచి కాకుండా బైపాస్‌లో వెళ్లేలా నిర్ణయించారన్నారు. బైపాస్ రహదారి వల్ల వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటాయని పేర్కొన్నారు. పలు గ్రామాల ప్రజలు హైవే నిర్మాణానికి తమభూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ పరిస్థితులను గమనించి గ్రామ ప్రజలు కోరుతున్న విధానంగా వనిపెంటలో నుంచే జాతీయరహదారిని నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

క్లుప్తంగా

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి


మృతి చెందిన నారాయణనాయక్

జమ్మలమడుగు రూరల్ : బైక్ మరమ్మతులు చేసుకుని వెళ్తుండగా అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. జమ్మలమడుగు మండలపరిధిలోని పి. బొమ్మేపల్లి గ్రామంలోని తండాకు చెందిన మూడే నారాయణ నాయక్(34) జమ్మలమడుగుకు వచ్చారు. బైక్ మరమ్మతు చేయించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యంలో జమ్మలమడుగు పరిధిలోని రోజా టవర్స్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిపోయారు. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బద్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అరెస్టు

మైదుకూరు : బద్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎర్రగొల్ల గోపాలస్వామిని అరెస్టు చేసినట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద ప్రసాద్ తెలిపారు. డీఎస్పీ తెలిపిన మేరకు.. గోపవరం మండలం ఎల్లారెడ్డి పేటకు చెందిన మేడిమెల సుశీల భర్త రత్నం 2018లో మృతి చెందాడు. అయితే అతను బతికి ఉన్నట్టు ఫోర్జరీ ఆధార్ సృష్టించి అతని పేరుతో ఉన్న చెన్నంరెడ్డిపల్లె పొలం సర్వే నంబర్ 1754/2లోని 1.02 ఎకరాల పొలాన్ని గోపాలస్వామి, డ్రైవర్ లక్ష్మీనారాయణ పేరుతో రిజిస్టర్ చేయించుకున్నాడు. ఆ విషయంపై రత్నం భార్య మేడిమెల సుశీల ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బుధవారం ఎర్రగొల్ల గోపాలస్వామిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ వివరించారు.

జలాశయంలోకి దూకి చేనేత కార్మికుడి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న వెంకటేశ్ (ఫైల్)

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : కుటుంబం కోసం చేసిన అప్పులు ఏలా తీర్చాలో తెలియ మనస్తాపం చెందిన ఓ వ్యక్తి మైలవరం జలాశయంలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం జరిగింది. పట్టణ ఎస్ఐ కల్పన వివరాల మేరకు.. జమ్మలమడుగు మండలం గూడెం చెరువు గ్రామంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన ఊసవాండ్ల పెద్ద వెంకటేశ్(40) చేనేత కార్మికుడిగా పని చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని భార్య సుమలతకు చెప్పి వెళ్లాడు. రాత్రయినా రాకపోవడంతో మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. బుధవారం మైలవరం జలాశయంలో మృతదేహం కనిపించడంతో గత ఈతగాళ్లతో వెలికితీయగా.. గూడెంచెరువు గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిసింది. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ కల్పన తెలిపారు.

శక్తి స్వరూపిణి.. సర్వ మంగళకారిణి

- భక్తుల కొంగు బంగారంగా ఈశ్వరీదేవి
- 22 నుంచి ఆరాధన గురుపూజ మహోత్సవాలు

బ్రహ్మంగారిమఠంలో కొలువుదీరిన ఈశ్వరీదేవి.. జగన్మాతగా విరాజిల్లుతున్నారు. భక్తుల కొంగు బంగారంగా నిలిచి.. విశేష పూజలందుకుంటున్నారు. శక్తిస్వరూపిణి, సర్వ మంగళకారిణిగా ప్రసిద్ధి చెందారు. ఈశ్వరీదేవి మఠంలో ఈ నెల 22 నుంచి అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారి చరిత్ర, ఉత్సవాలపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో వెలసిన వీరబ్రహ్మేంద్రస్వామి క్షేత్రం పక్కనే ఈశ్వరీదేవి మఠం ఉంది. పరాశక్తి స్వరూపిణి పార్వతీదేవి, లక్ష్మీదేవి అంశ నుంచి ఈశ్వరీదేవి అవతరించారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆమె 1703లో స్వస్తిశ్రీ స్వభాను నామ సంవత్సరంలో జన్మించారు. కాలజ్ఞాన ప్రబోధకర్త శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మనవరాలు ఈశ్వరీదేవి. బ్రహ్మంగారి రెండో కుమారుడైన గోవిందస్వామి, గిరియమ్మ దంపతుల పెద్ద కుమార్తె. ఆమె చిన్నప్పటి నుంచే సంస్కృతం, తెలుగు భాషలపై పాండిత్యం సంపాదించారు.


బ్రహ్మంగారిమఠంలోని ఈశ్వరీదేవిమఠం


ప్రత్యేక అలంకరణలో ఈశ్వరీదేవి

12 ఏళ్ల వయసులోనే..

ఒక రోజు గోవిందస్వామి శయ్యపై పరుండి, తీవ్రమైన ధ్యాననిష్టలో మునిగిపోయారు. అలా మూడు రోజులున్నారు. పిలిచినా పలకలేదు. చనిపోయారేమోనని భావించి ఆయన భార్య గిరియమ్మ, బంధుమిత్రులు దుఃఖించుట ప్రారంభించారు. అప్పుడు 12 ఏళ్ల వయసు ఉన్న ఈశ్వరీదేవి వచ్చి.. చింతించే పనిలేదని వారికి చెప్పారు. నాయన పరమాత్మతో ఆత్మను లీనం చేశారని తెలిపారు. వీరబ్రహ్మేంద్ర స్వామి తెలిపిన 'ఓం హ్రీం క్లీం శ్రీం శివాయ బ్రాహ్మణే నమః' అనే బీజాక్షరీ మంత్రాన్ని జపించారు. వెంటనే గోవింద స్వామి లేచి కూర్చున్నారు. ఈ విషయాన్ని చూసిన జనం సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. అప్పటి నుంచి ఈశ్వరీదేవి సామాన్య మనిషి కాదని, మహిమాన్వితురాలని గుర్తించారు. తండ్రినే గురువుగా భావించి.. ఆయన ద్వారా మంత్రోపదేశం నేర్చుకున్నారు.

14 ఏళ్లు తపస్సు చేసి..

బ్రహ్మంగారిమఠానికి సమీపాన ఉన్న నల్లమల అడవుల గుహలో 14 ఏళ్లు కఠోర తపస్సు చేసి.. అష్టాంగయోగాది, జ్ఞాన వాక్సిద్ధి పొందారు. వీరబ్రహ్మేంద్రస్వామి స్వప్నసాక్షాత్కార దర్శనం పొంది.. ఆయన ఆజ్ఞ ప్రకారం బ్రహ్మతత్వాన్ని బహుళ ప్రచారం చేయుటకు సంకల్పించారు. తల్లిదండ్రులు వివాహ ప్రయత్నం చేయగా.. నిరాకరించారు. లోక కల్యాణార్థం స్వీయ కల్యాణాన్ని త్యజించి బ్రహ్మచర్య దీక్ష బూని ఆత్మతత్వ బోధనలు రచించారు.

ఎన్నో మహిమలు

ఈశ్వరీదేవి ఎన్నో లీలలు ప్రత్యక్షంగా చూపించారని భక్తులు చెప్పుకొంటూ ఉంటారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం చాగలమర్రిలో ఈశ్వరీదేవి చేతి ప్రసాదాలు నిరాకరించి, పరిహాసం ఆడిన ఓ వర్తకుడు పిచ్చివాడిగా మారారని చెబుతారు. వినుకొండ వాసుల కోరిక మేరకు.. మంచి నీటితో దీపాలు వెలిగించారని, కుష్టు వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి నయం చేశారని, ఓ బ్రాహ్మణుడి చంపల వ్యాధిని తన కర స్పర్శతో పోగొట్టారని భక్తులు చెబుతారు.

మఠాధీశులై.. నిత్య పూజలు

తండ్రి గోవిందస్వామి యోగ సమాధి నిష్ట వహించిన దివ్య సన్నిధానానికి గర్భగుడి, అంతరాలయం, ముఖ మండపం నిర్మించి ప్రత్యేక(చిన్న) మఠం ఏర్పాటు చేశారు. ఆ మఠానికి మఠాధీశురాలై నిత్య పూజ కార్యక్రమాలు, ఆరాధన గురుపూజోత్సవాలు ఈశ్వరీదేవి నిర్వహిస్తుండేవారు. అమ్మవారి బోధనలు విని ఆకర్షితులై.. ఎంతో మంది శిష్యులుగా మారారు. దీంతో ఆమె శిష్యసమేతంగా దేశ పర్యటన చేసి భక్తితత్వాన్ని ప్రచారం చేశారు. వీరబ్రహ్మేంద్రస్వాములను ఈశ్వరీదేవి పిలిచిన 'జేజినాయన' అనే పిలుపు లోక ప్రసిద్ధమై.. నాటి నుంచి భక్తజనులు ఆయనను 'జేజినాయన' అని కొలుస్తున్నారు. 1789లో ఆమె చిన్నమఠంలో సజీవ సమాధి నిష్ట వహించారు. నాటి నుంచి భక్తజనుల నిత్య నీరాజనాలు స్వీకరిస్తున్నారు.

ఆరాధనోత్సవాలు

ఈ నెల 22వ తేదీ నుంచి 27వ తేదీ వరకు అమ్మవారి ఆరాధన గురుపూజ ఉత్సవాలు నిర్వహించనున్నారు. 24న మార్గశిర బహుళ నవమిన సజీవ సమాధి నిష్ట వహించిన రోజు కనుక ప్రధాన వేడుక నిర్వహిస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తారు.

దర్శనీయ స్థలాలు

బ్రహ్మంగారిమఠంలో దర్శనీయ స్థలాలు చాలా ఉన్నాయి. వీరబ్రహ్మేంద్రస్వామి మఠం, కాలజ్ఞాన ప్రతులు, నివాసగృహం, స్వామి తవ్విన బావి, పోలేరమ్మతో నిప్పు తెప్పించిన రచ్చబండ, కక్కయ్య మఠం, పోలేరమ్మ గుడి, రామాలయం(భజన మందిరం), అచలా నందస్వామి ఆశ్రమం, మద్దాయత్రి విశ్వకర్మ వంశవృక్ష దేవాలయం, ఈశ్వరీదేవి తపస్సు చేసిన గుహ, బ్రహ్మంసాగర్, ముడుమాలలోని సిద్దయ్య మఠం, అక్కంపేటలోని నాగలింగేశ్వరస్వామి ఆలయం (విభూదిలింగం).

ఘనంగా ఏర్పాట్లు



అమ్మవారి ఆరాధనోత్సవాలకు భక్తుల సహకారంతో మఠం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నాం. ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నాను.

– శ్రీ వీరశివకుమారస్వామి, మఠాధిపతి, ఈశ్వరీదేవిమఠం

26 నుంచి ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ నెల 26వ తేదీ నుంచి జనవరి 25వ తేదీ వరకు ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. కార్గో సేవల్లో భాగంగా డోర్ డెలివరీ సదుపాయం కడప, బద్వేల్, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల, రాజంపేట, రాయచోటి పట్టణాలలో 2021 డిసెంబరు, 1వ తేదీ నుంచి ప్రారంభించామన్నారు. ఆరు డిపోల కార్గో సెంటర్ల నుంచి రాష్ట్రంలోని 80 ముఖ్య పట్టణాలకు ఈ డోర్ డెలివరీ సౌకర్యం ఉంటుందన్నారు. ఇందుకోసం కౌంటర్ నుంచి పది కిలోమీటర్ల పరిధి వరకు 50 కిలోల బరువుగల పార్శిళ్లకు ఈ అవకాశాన్ని కల్పించామన్నారు. బుక్ చేసిన ప్రతి పార్శల్‌కు బీమా సౌకర్యం కల్పించామన్నారు. పూర్తి వివరాలకు 99592 25848, 99592 23209, 99492 49717 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

డోర్ డెలివరీ ఫిక్స్‌డ్ ఛార్జీల వివరాలు



కిలోలు	ఛార్జీ (జీఎస్టీ అదనం)
0–1	రూ. 15
1–6	రూ. 25
6–10	రూ. 30
10–25	రూ. 40
25–50	రూ. 50

సోషల్ మీడియా యాక్టివిస్ట్ సుధారాణికి బెయిల్ మంజూరు

మదనపల్లె : సోషల్ మీడియా యాక్టివిస్ట్ సుధారాణికి రెండో ఏడీఎం కోర్టు న్యాయమూర్తి రెగ్యులర్ బెయిల్ మంజూరు చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సుధారాణిపై కేసు నమోదైంది. నరసరావుపేట జైలులో ఉన్న ఆమెను ఈ నెల 12న మదనపల్లె పోలీసులు తమ కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. పోలీసు విచారణ తర్వాత 13న న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, ఈ నెల 26 వరకు రిమాండ్ విధించారు. దీంతో ఆమెను పోలీసులు తిరిగి నరసారావుపేటకు తీసుకెళ్లారు. బెయిల్ పిటిషన్ విచారణలో సుధారాణి తరఫున లాయర్ ప్రసాదరెడ్డి న్యాయమూర్తి ఎదుట వాదనలు వినిపించారు. దీంతో రెగ్యులర్ బెయిల్ మంజూరైంది. సుధారాణికి రెగ్యులర్ బెయిల్ మంజూరైంది.

ఇదేం రాజకీయం...?

- నగర అధ్యక్షుడిపై దాడి చేసిన వ్యక్తికి అందలం
- మండిపడుతున్న టీడీపీ శ్రేణులు


ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫొటో దిగిన ఎమ్మెల్యే మాధవి, శివకొండారెడ్డి కేసులో నిందితుడు

టాస్క్‌ఫోర్స్ : ఎన్నో ఏళ్లుగా తెలుగుదేశం పార్టీని అంటిపెట్టుకొని.. కష్టనష్టాలకోర్చి, కేసులు పెట్టించుకున్న కార్యకర్తలు కనుమరుగవుతున్నారు. నిన్నగాక, మొన్న పార్టీలోకి వచ్చిన వారిని అందలమెక్కిస్తున్న కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి రాజకీయాలు చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇటీవల టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై చిన్నచౌక్‌లో అదే పార్టీకి చెందిన నాయకులు దాడిచేశారు. ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడి ప్రోద్బలంతోనే ఈ దాడి జరిగిందని అప్పట్లో పత్రికలు, మీడియా కోడై కూశాయి. ఆ ఆరోపణలను ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు ఖండించడమే గాక, రిమ్స్‌లో చికిత్స పొందుతున్న శివకొండారెడ్డిని పరామర్శించారు. తాజాగా శివకొండారెడ్డిపై దాడి కేసులో ఎ1 ముద్దాయిగా ఉన్న వ్యక్తిని ఎమ్మెల్యే మాధవి ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు తీసుకెళ్లి పరిచయం చేయడంపై టీడీపీ కార్యకర్తలు, నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా టీడీపీలో ఉంటూ పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తున్న తమను ప్రోత్సహించి అధినేతతో పరిచయం చేయించిన దాఖలాలు ఎప్పుడూ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే తీసుకెళ్లిన వ్యక్తి గత ఐదేళ్లలో ఎక్కడైనా టీడీపీ జెండా పట్టుకున్నాడా? ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్నాడా? పార్టీ బలోపేతం కోసం ఆయన చేసిన కార్యక్రమాలేమిటి? అంటూ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే మెప్పు కోసం సొంత పార్టీ నేతపై దాడి చేయడమే అర్హత అవుతుందా...ఇదేం న్యాయమని నిలదీస్తున్నారు. కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

పెద్దతిప్పసముద్రం మండల మీట్ నిర్వహించండి

- వారంలోగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు
- శాంతిభద్రతలపై కోర్టుకు ఆధారాల సమర్పణ
- ఎంపీపీ అనుమతి లేకుండానే..
- అధికారుల అత్యుత్సాహంతో నేడు మండల మీట్


సమావేశం నిర్వహించాలని ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీలు

బి.కొత్తకోట : అధికారుల ఏకపక్ష ధోరణి, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం, అభివృద్ధిని కాలరాసే విధంగా సాగుతున్న చర్యలపై పెద్దతిప్పసముద్రం ఎంపీపీ మొహమూద్ హైకోర్టును ఆశ్రయించగా అధికారులకు చెంపపట్టు లాంటి తీర్పు ఇచ్చింది. పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి వారంలోగా మండల పరిషత్ సమావేశాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే తంబళ్లపల్లె నియోజకవర్గంలో అభివృద్ధిని అడ్డుకోవడమే కాక మండల పరిషత్ సమావేశాలను జరగనివ్వకుండా అడ్డుపడుతూ శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో పీటీఎం మండల పరిషత్ సమావేశ నిర్వహణపై హైకోర్టును ఆశ్రయించారు.

వారంలో జరపండి :

పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ సమావేశాన్ని ఈ ఆగష్టు ఏడున నిర్వహిస్తున్నట్టు అధికారులు సర్క్యులర్ జారీ చేశారు. సమావేశానికి పై హాలులో ఎంపీపీ, ఎంపీటీసీలు హాజరయ్యారు. ఈ సమావేశం జరగనివ్వకుండా కూటమి నాయకులు అడ్డుపడి శాంతిభద్రతల సమస్యను సృష్టించారు. దీనిపై ఎంపీపీ హైకోర్టును ఆశ్రయించారు. సమావేశం జరగకుండా అడ్డుపడిన ఘటనలకు సంబంధించిన వివరాలు, అధికారుల తీరుపై ఆధారాలను సమర్పించారు. హైకోర్టు ఈ మేరకు తీర్పు ఇస్తూ నిబంధనల మేరకు వారంలోగా సమావేశం నిర్వహించాలని, శాంతిభద్రతల సమస్య లేకుండా సుహృద్భావ వాతావరణంలో సమావేశం నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు ఎంపీపీ, ఎంపీటీసీలు బుధవారం ఎంపీడీఓ అబ్దుల్‌కలాం అజాద్‌కు వినతిపత్రం అందించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఎలాంటి సమస్యలు లేకుండా సర్వసభ్య సమావేశం నిర్వహించాలని కోరారు.

ఎంపీపీ అనుమతి లేకనే..

హైకోర్టు వారంలోగా సమావేశం నిర్వహించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు బుధవారం అందగా అధికారులు అత్యుత్సాహం చూపించారు. సాధారణంగా మండలమీట్ జరపాలంటే ఎంపీపీ ఇచ్చే తేది, అనుమతి పొందాక సర్క్యులర్ ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులకు సమాచారం ఇవ్వాలి. అయితే ఎంపీపీ మొహమూద్ అనుమతి లేకుండానే అధికారులు సమావేశ నిర్వహణకు నిర్ణయించి ఈనెల 11న సర్క్యులర్ జారీ చేశారు. గురువారం సమావేశ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రైతులతో చర్చించి..భూముల ధర నిర్ణయిస్తాం

రైతులతో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్


రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

వేంపల్లె/ఎర్రగుంట్ల/వీరనాయనపల్లి : రైతులతో చర్చించిన తర్వాతే అవార్డు ప్రకటించి భూముల ధర నిర్ణయిస్తామని వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. యర్రగుంట్ల, వేంపల్లె, వీరనాయునిపల్లె గ్రామాల్లో జాతీయ రాహదారి–440 నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులతో ఆమె బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ యర్రగుంట్ల, పోట్లదుర్తి, వై.కోడూరు, పెద్దనపాడు, హనుమనుగుత్తి గ్రామాల్లో 101 ఎకరాల భూమి జాతీయ రహదారికి అవసరమవుతుందన్నారు. నిబంధనల మేరకు ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం ఇస్తామన్నారు. రైతులు మాట్లాడుతూ నష్టపరిహారం విషయం తమకు అనుకూలంగా లేకపోతే రాజీ కాలేమన్నారు. రోడ్డుకు అనుకుని ఉన్న భూముల ధర ప్రస్తుతం కోట్ల రూపాయలు ఉందని, అనుకూల ధర ఇస్తే భూములిస్తామని తెలిపారు.

- వేంపల్లె స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో భూములు కోల్పోయే రైతులు, లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వేంపల్లె పరిధిలో ఎకరా రూ.3 కోట్లు పలుకుతోందని, అందుకు అనుగుణంగా నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు జేసీని కోరారు. జేసీ మాట్లాడుతూ వేంపల్లె మండలంలోని 42.85ఎకరాల భూమిని 208 మందితో సేకరించినట్లు చెప్పారు. నిబంధనల మేరకు ఎకరాకు రూ.15 లక్షల పరిహారం కేటాయించామన్నారు రైతులు అడిగిన పరిహారం విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పారు. ఎన్‌హెచ్ యాక్ట్ ప్రకారం నష్ట పరిహారం ఫైనల్ చేసి లబ్ధిదారులకు అవార్డు ప్రకటించడం జరుగుతుందన్నారు. భూ సేకరణ నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ నుంచి మూడేళ్ల ముందు వరకు జరిగిన ప్రతి ట్రాన్సలేషన్ పరిశీలించి ఎక్కువ ఉన్న 50 శాతం వాటిని తీసుకొని యావరేజ్ విలువ లెక్కగడతారన్నారు.
- వీరపునాయునిపల్లె డిగ్రీ కళాశాలలో రైతులతో జరిగిన సమావేశంలో అదితి సింగ్ మాట్లాడుతూ భూమిలో బోరు, బావులకు, చీనీ, నిమ్మ చెట్లకు ప్రత్యేకంగా నిధులు చెల్లిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించేందుకు గ్రామ సభలు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె తెలియజేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ చిన్నయ్య, నేషనల్ హైవే స్పెషల్ కలెక్టర్ వెంకటపతి, తహసీల్దార్లు హరినాథరెడ్డి, లక్ష్మీదేవి, శోభన్‌బాబు, రెవెన్యూ అధికారులు, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్

తప్పిన పెను ప్రమాదం


పేలుడుధాటికి ఎగిసిపడుతున్న మంటలు

కడప అర్బన్ : కడప నగరంలోని రవీంద్రనగర్‌లో హుజ్రా మసీదు సమీపంలో ఓ ఇంట్లో బుధవారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలి అగ్ని ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పేలుడుధాటికి ఇంటి పైకప్పు ఎగిరిపడింది. జిల్లా సహాయ అగ్నిమాపక అధికారికి సమాచారమివ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, రెండు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను ఆర్పివేశారు.

ప్రజల నెత్తిన రూ. 6 వేల కోట్ల గుదిబండ

- 27న విద్యుత్తు బిల్లుల పెంపునకు నిరసనగా ధర్నా
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : విద్యుత్తు బిల్లులు పెంచనంటూ ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని విస్మరించి ప్రజల నెత్తిన రూ.6వేల కోట్ల గుదిబండ మోపారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్తు బిల్లుల పెంపును నిరసిస్తూ ఈ నెల 27న జిల్లా కేంద్రంలో తలపెట్టిన ధర్నాకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. 2014లో దొంగ హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన చంద్రబాబు.. అవే హామీలతో మళ్లీ 2024లో అధికారంలోకి వచ్చారని గుర్తుచేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ట్రూ అప్ చార్జీలు వసూలు చేస్తున్నారు.., తాము అధికారంలోకి వస్తే విద్యుత్తు బిల్లులు పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు ఆరుమాసాలు కాకముందే రూ.6వేల కోట్ల భారం మోపారన్నారు. వచ్చే నెల మరో రూ.9 వేల కోట్లు బాదుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్లు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచినట్లే పెంచి, మూడు లక్షల మంది పింఛన్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ల స్క్రీనింగ్ కోసం 40 మందికి ఒక అధికారిని నియమించడం చూస్తుంటే 10 లక్షల మంది పింఛన్లు తొలగించడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, సానుభూతి పరుల పింఛన్లు మాత్రమే తొలగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పేరుకు, ప్రచారానికి మాత్రమే అన్న క్యాంటీన్లు అని చెప్పి.. ఒక్క సిలిండర్ ఇచ్చి ఊరుకున్నారని, చాలా మందికి డబ్బులు రావడంలేదని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ అమలు చేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని హితవు పలికారు. జగనన్న హయాంలో ప్రతి నెలా ఒక పథకం ప్రజలకు చేరేదని, ప్రస్తుతం ప్రజలకు ఎలాంటి పథకాలు అందడం లేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, గంగాధర్ రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాస రెడ్డి, చెన్న కేశవరెడ్డి, సుధా కొండారెడ్డి, ఆర్ వీఎస్ఆర్, జగన్‌మోహన్‌రెడ్డి, గఫార్, ఇస్మాయిల్, ఇర్ఫాన్, శరత్‌బాబు, దేవదానం, జెట్టి నగేష్, జావీద్, జిలానీ, ఖాజా హుసేన్, గౌస్‌మున్నా, సుదర్శన్‌రెడ్డి, సురేష్, సుబ్బన్న పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలను పరిశీలించిన న్యాక్ బృందం

వైవీయూ : నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(న్యాక్) పీర్ కమిటీ బృందం బుధవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల)ను సందర్శించింది. కళాశాలకు వచ్చిన న్యాక్ పీర్ కమిటీ చైర్ పర్సన్ ఆచార్య రాజీవ్ జైన్, మెంబర్ కోఆర్డినేటర్ డాక్టర్ మధురేంద్రకుమార్, సభ్యుడు డా.రమేష్ కుంభార్ బృందానికి ముందుగా ఎన్‌సీసీ కేడెట్స్ గౌరవ వందనం సమర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.జి. రవీంద్రనాథ్ కళాశాల సమగ్ర ప్రగతిని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఆపై న్యాక్ బృందం కళాశాలలోని పలు విభాగాలను పరిశీలించింది. డిపార్ట్‌మెంట్‌లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల వివరాలు, పూర్వ విద్యార్థుల ప్రగతి, పరిశోధనలు, పరిశోధక పత్రాలు, సైటేషన్స్, హెచ్–ఇండెక్స్ తదితర అంశాలన్నింటినీ క్షుణ్ణంగా బృందం సభ్యులు అడిగి తెలుసుకుని రికార్డు చేశారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో జరిగిన సమావేశంలో కళాశాల ప్రగతిలో వారి భాగస్వామ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. భౌతిక శాస్త్రం వంటి విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబరచడంపై న్యాక్ బృందం సంతృప్తి వ్యక్తం చేశారు.